

ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా..

ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి వాటిని ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేస్తున్నారు.

- 8లో ▸



అకాల వర్షం..

అకాల వర్షం అన్నదాతలను ఆగం చేస్తోంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.0 /23.9

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీయవచ్చు. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.



న్యూస్‌రీల్

22 నుంచి 24 వరకు రైల్వేగేటు మూసివేత

ఇందల్వాయి : కామారెడ్డి–నిజామాబాద్ రైల్వే లైను విద్యుద్దీకరణ నేపథ్యంలో ఇందల్వాయి రైల్వేగేటు వద్ద పలు మరమ్మత్తులు, రైల్వే లైను పరీక్షల నిమిత్తం ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రైల్వే గేటు మూసివేస్తునట్లు రైల్వే ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఎస్ఎస్‌సీ నాగభూషణం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు ట్రాఫిక్‌ను తిర్మన్‌పల్లి–రాంపూర్–కమలాపూర్–డిచ్‌పల్లి మీదుగా మళ్లించనున్నామని ఇందుకు ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని కోరారు.

నేడు జిల్లాకు వర్షసూచన

రుద్రూర్ : ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గాలి వేగం గంటకు 30నుంచి 40కి.మీ) కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. అలాగే పలు చోట్ల పగటి ఉష్ణోగ్రతలు 41 నుంచి 43 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని పేర్కొన్నారు.

138 మంది టీచర్లకు నోటీసులు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి మూల్యాంకనానికి గైర్హాజరైన టీచర్లకు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం నోటీసులు జారీచేశారు. జిల్లా వ్యాప్తంగా 138 మంది టీచర్‌లు స్పాట్ వాల్యుయేషన్‌కు డుమ్మా కొట్టారు. దీంతో వీరికి నోటీసులు జారీ చేసినట్లు డీఈవో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల వరకు వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. లేదంటే సస్పెన్షన్ వేటు వేస్తామన్నారు. ప్రస్తుతం నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో పదో తరగతి వాల్యుయేషన్ కొనసాగుతోంది. ఇందుకోసం 992 మంది టీచర్లను ఎంపిక చేశారు. కాగా కొందరు టీచర్లు అనారోగ్య కారణాలతో డుమ్మా కొడుతున్నారు. అకస్మాత్తుగా గైర్హాజరు కావడంతో రెండు రోజులు స్పాట్ విధులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో డీఈవో నోటీసులు జారీ చేశారు. కొందరు సంఘం నాయకులు కొంత మంది టీచర్లను ఈ విధుల నుంచి తప్పించేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చారు.

ఆర్టీసీ కార్గో ఏజెన్సీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లాలో కార్గో ఏజెన్సీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్గో ఇన్‌చార్జి శంకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అర్సపల్లి, ఆర్యనగర్, కంఠేశ్వర్, వర్ని ఎక్స్ రోడ్, పూసలగల్లి, పులాంగ్ చౌరస్తా వద్ద, అలాగే ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండల కేంద్రం, బస్సు సౌకర్యం కలిగిన అన్ని గ్రామాలకు కార్గో ఏజెన్సీ తీసుకోవడానికి టీఎస్ ఆర్టీసీ అవకాశం కల్పించిందన్నారు. అలాగే ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్‌కి కూడా అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (9154298731), రీజినల్ కంప్యూటర్ ఆపరేటర్ (7382844006) నంబర్లను సంప్రదించాలన్నారు.

అంతా నా ఇష్టం!

- పాలకమండలితో పనేంటి అన్నట్లు తెయూ వీసీ వ్యవహారం
- ఇష్టారీతిన నియామకాలు, పదోన్నతులు
- ఈసీ ఆమోదం లేకుండానే చక్కబెట్టుకుంటున్న తీరు
- ఉన్నత విద్యాశాఖ జోక్యంతో ఈసీ సమావేశం
- ఈసీలో రిజిస్ట్రార్ విద్యావర్ధిని నియామకం ఆమోదం అనుమానమే..?
- మళ్లీ యాదగిరినే నియమించే అవకాశం..!



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ రవీందర్ సామంతరాజులా వ్యవహరిస్తున్నారని పాలక మండలి సభ్యులు గుర్రుగా ఉన్నారు. ప్రభుత్వం నియమించిన పాలక మండలిని పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2021 అక్టోబర్ 30న పాలకమండలి ఆమోదంతో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ సమక్షంలో అప్పటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్యను తొలగించి యాదగిరిని నియమించారు. ఆ తర్వాత చివరిసారిగా 2021 నవంబర్ 27న ఈసీ సమావేశం జరిగింది. ఈసీ అనుమతి లేకుండా చేసిన నియామకాలన్నీ రద్దు చేయాలని తీర్మానించారు. అయినా వీసీ రవీందర్ ఖాతరు చేయకపోగా మరింత విచ్చలవిడిగా నియామకాలు, పదోన్నతులు ఇస్తూ వస్తున్నారు. మరోవైపు ఏకంగా ఈసీ మీటింగ్‌లో నవీన్ మిట్టల్ సమక్షంలో నియమించిన రిజిస్ట్రార్ యాదగిరిని తొలగించిన వీసీ.. 2021 డిసెంబర్ 9న శివశంకర్‌ను నియమించారు. తర్వాత మళ్లీ 2022 ఆగస్టు 17న శివశంకర్‌ను తొలగించి విద్యావర్ధినిని నియమించారు. గత 17 నెలలుగా పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయకుండా అక్రమ వ్యవహారాలన్నీ యధేచ్ఛగా సాగిస్తూ వస్తుండడంపై ఈసీ సభ్యులు ఆగ్రహంగా ఉన్నారు. అన్ని వ్యవహారాలను పరిశీలించిన ఉన్నత విద్యాశాఖ నుంచి పాలకమండలి సమావేశం నిర్వహించాలని ఆదేశాలు రావడంతో తప్పని పరిస్థితుల్లో తాజా సమావేశానికి తూతూమంత్రంగా ఎజెండా తయారు చేశారు. ఈసీ సభ్యులకు పూర్తి వివరాలు ఇవ్వలేదు. 8 నెలల క్రితం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా విద్యావర్ధిని నియామకం ఆమోదం, 2022–23, 2023–24 బడ్జెట్ ఆమోదం, పరీక్షల కంట్రోలర్, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్, మూడు క్యాంపస్‌ల ప్రిన్సిపాళ్ల నియామకం ఆమోదం కోసం ఎజెండాలో అంశాలను పెట్టారు. ఈసీ ఆమోదం లేకుండానే ఇష్టం వచ్చినట్లు నియామకాలు, ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు, రిజిస్ట్రార్లను సైతం ఏకపక్షంగా మార్పు చేయడంపై ఈసీ సభ్యులు ఆగ్రహంగా ఉన్నారు. గతంలో ఈసీ ఆమోదంతో నియమించిన యాదగిరినే తిరిగి రిజిస్ట్రార్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది.

తీర్మానాలను తుంగలో తొక్కి..

2021 నవంబర్ 27న జరిగిన ఈసీ సమావేశంలో చేసిన ఆదేశాలను, తీర్మానాలను వీసీ తుంగలో తొక్కారు. వివాదాస్పద ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్య చేసిన పాలనాపరమైన, అకడమిక్ పరమైన నియామకాలు, ఇతర అన్నిరకాల ఉత్తర్వులను రద్దు చేయాలన్న ఆదేశాన్ని పక్కన పెట్టారు. రెగ్యులర్ నాన్ టీచింగ్ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు సూపరింటెండెంట్లను, అసిస్టెంట్ రిజిస్ట్రార్లుగా నియమించడం నిబంధనలకు విరుద్ధమని, ఆ పదోన్నతులను రద్దు చేస్తున్నట్లు ఈసీ తీర్మానించింది. కొంతకాలం మౌనంగా ఉన్న వీసీ వారి పదోన్నతులను ఇటీవలే పునరుద్ధరించినట్లు సమాచారం.

- పదోన్నతుల కోసం ఒక్కొక్కరి వద్ద రూ. 5 లక్షల వరకు తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పదోన్నతులు పొందినవారే తమ దగ్గరివారితో చెప్పడం గమనార్హం. పదోన్నతులు కల్పించే ప్రతిపాదనలు ఈసీలో పెట్టకుండానే, ఈసీకి కనీసం సమాచారం ఇవ్వకుండానే అంతా నా ఇష్టం అన్నట్లుగా వీసీ వ్యవహరించడం విశేషం. ప్రమోషన్ కావాలనుకునే వారు నేరుగా వీసీని సంప్రదించి అడిగినంత ఇవ్వాలనే విషయం బహిరంగ రహస్యం. సదరు పదోన్నతులకు సంబంధించిన సమాచారాన్ని ఎవరికీ పంపకపోవడం గమనార్హం
- అవుట్ సోర్సింగ్ సిబ్బంది పదోన్నతుల్లో మరింత విచ్చలవిడిగా వీసీ వ్యవహరించారు. ఎవరికి ప్రమోషన్ కావాలనుకున్నా నేరుగా వీసీకి కలిసి వినతిపత్రం సమర్పిస్తే, ఆయన చెప్పిన సమయానికి ఒప్పుకున్న మొత్తాన్ని ఆయా హోదా ఆధారంగా రూ. 70 వేల నుంచి రూ. లక్షన్నర వరకు సమర్పించాలి. ఈ మేరకు సంబంధిత సమాచారం అకౌంట్స్ విభాగానికి వెళ్తుంది. ఆ హోదాకు సరిపోయే వేతనాన్ని ఆయా అభ్యర్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. అయితే సదరు పదోన్నతులు ఏడాదిన్నర క్రితమే జరిగినట్లు పత్రాలు సృష్టించి, ఆయా కాలానికి ఏరియర్స్ రూపంలో సదరు మొత్తాన్ని ఇస్తారు. ఇందులో వీసీ సైతం తీసుకుంటారని తెలుస్తోంది.

కొసమెరుపు ఏమంటే.. ఇటు పార్ట్ టైం ఉద్యోగులకు, అటు పదోన్నతులు పొందినవారికి సైతం తాను ఇక్కడ ఉన్నంత కాలం ఎలాంటి ఢోకా లేదని, వేతనాలు చెల్లిస్తామనీ, తాను వెళ్లాక మాత్రం వారి ఉద్యోగాలకు తన బాధ్యత లేదని సదరు అభ్యర్థులతో ముందుగానే చెప్పడం. తర్వాతనే డబ్బులు చేతులు మారుతున్నాయి. ఈ ప్రాతిపదికన పలువురు జూనియర్ అసిస్టెంట్లను ప్రోగ్రామర్లుగా, అటెండర్ స్థాయి ఉద్యోగులను ఆపై స్థాయి ఉద్యోగులుగా ప్రమోషన్లు ఇచ్చినట్లు సమాచారం. ఈసీ సమావేశంలో ఇవన్నీ చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

ఆస్పత్రి తీరు అంతే..



జీజీహెచ్‌లో రోగులను వీల్‌చైర్‌లో డాక్టర్ వద్దకు తీసుకెళ్తున్న బంధువులు



వీల్‌చైర్‌పై బెడ్‌షీట్‌లను తీసుకెళ్తున్న సిబ్బంది
-సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

- వీల్ చైర్‌లలో బెడ్ షీట్‌లు, వాటర్ బాటిళ్లు తరలిస్తున్న సిబ్బంది
- మరోవైపు రోగులను వార్డులకు తీసుకెళ్లడంలో బంధువుల పాట్లు
- రోగులతో ఆస్పత్రి సిబ్బంది తీరుపై ప్రతిపక్షాల నిరసనలు
- కలకలం రేపిన కాళ్లు పట్టుకుని రోగిని వార్డుకు తరలించిన బంధువుల ఘటన
- సమగ్ర నివేదికకు మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ ఆదేశాలు జారీ

నిజామాబాద్ సిటీ : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగిని స్ట్రెచర్‌లో వార్డుకు తరలించేందుకు సిబ్బంది ఎవరూ లేక పోవడంతో బంధువులే కాళ్లు పట్టుకుని ఈడ్చుకు వెళ్లిన ఘటన నుంచైనా.. ఆస్పత్రిలో తీరు మార్చుకోలేదు. ఏప్రిల్ 1న ఈ ఘటన జరగ్గా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. శనివారం ఆస్పత్రికి



శనివారం తెచ్చిన కొత్త స్ట్రెచర్‌లు, వీల్‌చైర్లు

వెళ్లిన 'సాక్షి' బృందానికి రోగులను వార్డుల తరలింపులో నిండా నిర్లక్ష్యం కనిపించింది. బంధువులే రోగులను స్ట్రెచర్, వీల్ చైర్‌లలో వార్డులకు తరలించారు. సిబ్బంది మాత్రం స్ట్రెచర్లు, వీల్ చైర్లలో వాటర్ బాటిళ్లు, బెడ్ షీట్‌లు తరలించేందుకు వినియోగించారు. మరో వైపు ఆస్పత్రిలో జరిగిన దారుణ ఘటనపై సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ తప్పును సరిదిద్దుకోకుండా కప్పిపుచ్చుకోవడంపై విపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. రోగిని బంధువులు కాళ్లు పట్టుకుని ఈడ్చుకుపోతున్న సమయంలో అక్కడ డ్యూటీలో ఎవరున్నారు.. ఎందుకని రోగిని వీల్‌చైర్, లేదా స్ట్రెచర్‌లో తరలించలేదో వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పకుండా సూపరింటెండెంట్ ఈ ఘటనపై ఉద్దేశ పూర్వకంగా సోషల్ మీడియాలో వైరల్ చేశారని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా శుక్రవారం రాత్రి వరకు కనిపించని స్ట్రెచర్లు, వీల్‌చైర్లు ఒక్కసారిగా పదుల సంఖ్యలో ఆస్పత్రిలో మరుసటి రోజు అందుబాటులో ఉంచారు.

విచారణకు ఆదేశాలు..

ఆస్పత్రిలో చోటుచేసుకున్న ఘటనపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి టీ హరీశ్‌రావు డీఎంఈ (డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్) రమేష్‌రెడ్డిని విచారణకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆస్పత్రి సిబ్బందిపై సీరియస్ అయ్యారు. స్ట్రెచర్ లేకుండా రోగిని సహాయకులు కాళ్లు పట్టుకుని లిఫ్ట్ వరకు ఈడ్చుకెళ్లిన వీడియో పుటేజీలను పరిశీలించారు. దీనిపై పూర్తి సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి

- ప్రభుత్వ వైఫల్యంతోనే టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీ
- రౌండ్ టేబుల్ సమావేశంలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం
- 18న నిరసన దీక్షకు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం, పక్కన మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా మరో ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ– ప్రభుత్వ వైఫల్యంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతోందన్నారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్‌లు దండుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రశ్నాపత్రాల లీకేజీల దందా చేస్తున్నారన్నారు. టీఎస్పీఎస్సీలో సాధారణ ఉద్యోగి ప్రవీణ్ వద్ద పాస్‌వర్డ్ ఉండడం వెనకాల ఎవరు ఉన్నారో తేల్చాలన్నారు. పరీక్షల లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. పరీక్ష రాసిన అభ్యర్థులకు లక్ష పరిహారం చెల్లించాలన్నారు. లేకపోతే ఈనెల 18న నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

కేసీఆర్ రాజ్యాంగం అమలవుతోంది..

రాష్ట్రంలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం కాకుండా సీఎం కేసీఆర్ రాజ్యాంగం అమలవుతోందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. ఈ ఘటనపై సంబంధం లేని మంత్రి కేటీఆర్ మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. సిట్ అధికారి శ్రీనివాస్‌పై కేసులు ఉన్నాయన్నారు. టీఎస్పీఎస్సీ చైర్మన్‌ను పదవిలో ఉంచి విచారణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీని వెనకాల కుట్ర జరుగుతోందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనపై తక్షణమే సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో కామారెడ్డి జేఏసీ చైర్మన్ జగన్నాథం, బహుజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు క్యాతం సిద్దిరాములు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బట్టెంకి బాల్‌రాజు, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి నిజ్జన రమేష్, టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ, ఆమ్ ఆద్మీ పార్టీ నేత మదన్‌లాల్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చందు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలు

- ఆస్పత్రిలో వీల్‌చైర్లు, స్ట్రెచర్ల కొరత లేదు
- జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వెల్లడి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన సేవలందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు. ఈ నెల 1న ఆస్పత్రిలో ఓ రోగిని కాళ్లు పట్టి లాక్కెళ్లినట్లు వైరల్ అయిన వీడియోపై ఆమె స్పందించి శనివారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. మార్చి 31న రాత్రి ఆస్పత్రికి వచ్చింది బోధన్ మండలం ఆచన్‌పల్లికి చెందిన హన్మాండ్లుగా భావిస్తున్నామని, ఇతను మద్యం సేవించి ఉండడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువచ్చారని తెలిపారు. అతడిని పరీక్షించిన వైద్యులు ఇతర అనారోగ్య కారణాలు కనబడుతున్నాయని, మరుసటి పరీక్షలు చేయించాలని, హన్మాండ్లును మద్యం నుంచి దూరంగా పెట్టేందుకు డిఅడిక్షన్ సెంటర్‌లో పెట్టి కౌన్సిలింగ్ చేస్తామని చెప్పారన్నారు. అతడితో పాటు వచ్చిన ఇద్దరు మహిళలు తాము ఆలోచించుకుని చెబుతామన్నారని వివరించారు. దాంతో ఆస్పత్రి సిబ్బంది క్యాజువాలిటీ వార్డు నుంచి కింది అంతస్తులోని వెయిటింగ్ హాల్‌కు వరకు వీల్ చైర్‌లో తీసుకువచ్చి బెంచ్‌పై కూర్చోబెట్టారని తెలిపారు. మరుసటి రోజు రెండో అంతస్తులో హన్మాండ్లును తల్లిదండ్రులు కాళ్లు పట్టి వైద్యుడి వద్దకు ఈడ్చుకెళ్తున్న వీడియో 10 సెకండ్లు పాటు తీసి 15 రోజుల తర్వాత వైరల్ చేయడంలో ఉద్దేశం ఏమిటో తెలియదన్నారు. తమ సిబ్బంది వీడియో ఎందుకు తీశారని అడిగితే వీడియో తీసిన వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. ఆస్పత్రిలో 51 వీల్‌చైర్లు, 57 స్ట్రెచర్లు ఉన్నాయని, వీటికి వివిధ రంగులు వేసి ఫ్లోర్ వారీగా కేటాయించామన్నారు. అదనంగా 41 వీల్‌చైర్లు కూడా ఉన్నట్లు తెలిపారు. జనరల్ ఆస్పత్రి రోగులకు లక్షల రూపాయల విలువ గల ఆపరేషన్లు చేస్తూ ఎంతో మంచి పేరు తెచ్చుకుందన్నారు. కానీ తమ సేవలపై దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ఘటనకు ఆస్పత్రికి సంబంధం లేదన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాల్‌రాజు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై
వైద్యాధికారులకు శిక్షణ



నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నియమించబడిన హెల్త్ వెల్నెస్ సెంటర్, పీహెచ్‌సీ, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు అసంక్రమిత వ్యాధులపై(ఎన్‌సీడీ) ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమావేశ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి డీఎంహెచ్‌వో సుదర్శనం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ తేజ్ కిరణ్‌రెడ్డి జీవనశైలి వ్యాధులైన హైపర్ టెన్షన్, మధుమేహం, క్యాన్సర్ తదితర వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పరీక్షలు చేయడం, చికిత్సలు అందించడం, హైరిస్క్ ఉన్న వ్యాధిగ్రస్తులను స్థానిక ఆస్పత్రులకు రిఫర్ చేయడం, ఎన్‌సీడీ పోర్టల్‌పై శిక్షణ ఇచ్చారు. వీటికోసం ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలన్నారు. సంజీవని నోడల్ ఆఫీసర్ కృష్ణ ఈ సంజీవని రిపోర్ట్‌పై వైద్యాధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ కో–ఆర్డినేటర్ వెంకటేశం, జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ భూమి పట్టాలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి శివారులో సర్వే నంబరు 653లోని ప్రభుత్వ భూమిపై రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఈ సర్వే నంబరుపై వీఆర్వో, వీఆర్‌ఏలతో పాటు మరికొందరు పట్టాలు పొందారనే ఉదంతంపై సాక్షి పత్రికలో 'ప్రభుత్వ భూమిని పంచుకున్నారు' అనే శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. కథనంపై కలెక్టర్, నిజామాబాద్ ఆర్డీవో స్పందించారు. ఈ సర్వే నంబరులోని పూర్తి వివరాలను సమర్పించాలని స్థానిక తహసీల్దార్ వీర్‌సింగ్‌ను ఆదేశించారు. సర్వే నంబరులోని ప్రభుత్వ భూమి పాటు అక్కడ నిర్మించిన ప్రభుత్వ భవనాల వివరాలను తెలుసుకున్నారు. వీఆర్వో, వీఆర్‌ఏలతో పాటు మరికొందరి పేరిట జారీ అయిన పట్టాదారు పాసు పుస్తకాల వివరాలు, ఏ సంవత్సరంలో ఎవరి పేరుమీద ఎంత భూమి పట్టా అయిందనే వివరాలను ఉన్నతాధికారులకు స్థానిక రెవెన్యూ అధికారులు సమర్పించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అవగాహన



ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలోని వివిధ న్యాయస్థానంలో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు పాటిస్తున్న విధులు, పోలీస్ యంత్రాంగాన్ని ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. రవిరాజ్, కవితారెడ్డి, వసంత, డాక్టర్ సమ్మయ్య, ఆవారి రమేష్, ఎండీ రహీంద్దీన్, భూసారపు రాజేష్‌గౌడ్, చిదిరాల రాణి, వీరయ్య, అశోక్ శివరామ్ నాయక్, నరేందర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి నేడు ప్రవేశ పరీక్ష

డిచ్‌పల్లి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష (బీఎల్‌వీ) నిర్వహిస్తున్నట్లు సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ మేరీ యేసుపాదం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎంపిక చేసిన కేంద్రాలలో పరీక్ష ఉంటుందన్నారు. హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా..

- చోరీలు చేస్తున్న దొంగలు
- వ్యవసాయ క్షేత్రాల వద్ద రాత్రిపూట ధ్వంసం చేసి..
- కాపర్ వైరు, ఆయిల్ కాజేస్తున్న వైనం
- అదనపు భారంతో లబోదిబోమంటోన్న రైతులు



బోదేపల్లిలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న రైతులు, ట్రాన్స్‌కో అధికారులు

బాల్కొండ: ఊరికి దూరంగా పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని కాపర్ వైరు, ఆయిలు చోరీ చేస్తున్నారు. పొలాలు చేతికొచ్చే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు వారాల వ్యవధిలో బాల్కొండ, మెండోరా మండలాల పరిధిలో నుంచి 12 విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి బాల్కొండ మండలం బోదేపల్లి శివారులో వరద కాలువ వెంబడి బిగించుకున్న మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిలో చోరీ చేశారు. వారం రోజుల క్రితం అదే ప్రాంతం నుంచి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లారు. తరుచూ ఇలాంటి చోరీలు జరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం వెనుక ఎవరో ఉన్నారో కనిపెట్టాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. ప్రతి యేటా వేసవి కాలంలో బాల్కొండ మండల కేంద్రం నుంచి మండలంలోని కిసాన్‌నగర్, చిట్టాపూర్, ముప్కాల్ మండలం వేంపల్లి శివారు నుంచి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయి. ఏడేళ్ల నుంచి ప్రతి యేటా వేసవిలో ఇదే తంతు జరుగుతున్న పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పది రోజుల క్రితం మెండోరా మండలం వెల్కటూర్ శివారులో కాకతీయ కాలువ ఆధారంగా నీటి సరఫర కోసం బిగించిని ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్లారు. విద్యుత్ అధికారులు అక్కడ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ఎండుతున్న పంటలు

వరుస పెట్టి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అవుతుండటంతో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఎత్తుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తది పెట్టడానికి ట్రాన్స్‌కో అధికారులకు తల ప్రాణం తోకకు వస్తుంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలంటే ట్రాన్స్‌కో నుంచి మంజూరు కావాలి. దాని కోసం ఎఫ్ఐఆర్ కావాలి. ఇదంత చేయడానికి పది రోజులు పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు అంటున్నారు. అంతలోపు పంటలకు నీరందక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు స్పందించి చోరీల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైతులు గస్తీ తిరగాలి

రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కొన్నాళ్ల పాటు గస్తీ తిరగాలి. ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలి. నిత్యం దొంగతనాలు జరగడం అర్థం కావడం లేదు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఏఈ, బాల్కొండ

కేసులను దర్యాప్తు చేస్తున్నాం

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులను దర్యాప్తు చేస్తున్నాం. కొంతమందిపై అనుమానం ఉంది. కేసును ఛేదించి నిందితులను పట్టుకుంటాం. పెట్రోలింగ్‌ను కూడా పెంచాం. ట్రాన్స్‌కో అధికారులు, రైతులు పోలీసులతో సహకరించాలి.

– గోపి, ఎస్సై, బాల్కొండ

దళితులను మోసం చేస్తున్న కేసీఆర్



సహపంక్తి భోజనం చేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని దళితులను సీఎం కేసీఆర్ అడుగడుగునా మోసం చేస్తున్నారని, వారికిచ్చిన ఏ ఒక్క హామీని అమల్జేయలేదని మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. శనివారం నిజామాబాద్ అర్బన్‌లోని 9వ డివిజన్‌లోగల ఇంద్రపురి కాలనీలో దళిత బస్తీలో దళితులతో కలిసి బీజేపీ నాయకులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, దళిత నాయకుడిని రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, దళిత బంధు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు అంటూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని, నిజంగా కేసీఆర్‌కు దళితుల అభ్యున్నతిపై చిత్తశుద్ధి లేదన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దళిత కళాకారులు, చెప్పులు కుట్టే వారికి, కాటికాపరులకు రూ.5వేల పింఛన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేడ్కర్ విగ్రహం పార్లమెంట్‌లో ఏర్పాటు చేశామని, అంబేడ్కర్ పుట్టి, పెరిగి, నివసించిన, చదువుకున్న ప్రాంతాలను పంచతీర్థాలుగా గుర్తించామని పేర్కొన్నారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి చూపు ప్రధానం



ఖలీల్‌వాడి: కళ్లు మనిషికి ప్రధానమని, కంటి చూపుతోనే ప్రపంచాన్ని చూడగలుగుతామని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల మహాత్మ జ్యోతిబా పూలే స్కూల్, జూనియర్ కాలేజీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేయడానికి కంటి సహాయ నిపుణుల అసోసియేషన్, న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, కంటి సహాయ నిపుణుల అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్ కుమార్, భుజంగ రెడ్డి, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతన్న ఆగమాగం



రెంజర్లలో పసుపు తడవకుండా కప్పిన టార్పాలిన్లు

బాల్కొండ: అకాల వర్షం అన్నదాతలను ఆగం చేస్తోంది. రెండు రోజుల నుంచి జిల్లాలో వర్షం కురుస్తుండటంతో రైతులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో రైతులు ఆరబెట్టిన పంటలు ఎండకుండా కాపాడుకోడానికి పరుగులు తీశారు. పసుపు, ధాన్యం తడిసి పోకుండా టార్పాలిన్లు కప్పారు. ప్రస్తుతం పసుపు పంట చివరి దశలో ఉంది. ఉడికించి కళ్లాల వద్ద ఆరబెట్టారు. అకాలంగా వర్షం కురవడంతో పంట తడిసి చందూరం ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చందూరం ఏర్పడితే వ్యాపారులు పసుపును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. వరి ధాన్యం తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉంది. అంతే కాకుండ వరి ధాన్యం వర్షంతో రాలిపోతుంది. గింజలు రాతిలే దిగుబడి సగానికి పడిపోతుంది. గాలివానకు మామిడి కాయలు రాలిపోతున్నాయి. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఫారెస్ట్ అకాడమీ, తెయూ మధ్య ఎంవోయూ



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న ఫారెస్ట్ అకాడమీ కార్యదర్శి, తెయూ వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): సెంటర్ ఫర్ ఫారెస్ట్ అండ్ నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీఈఎఫ్ఎన్ఏఆర్ఎం) తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ, తెలంగాణ యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంవోయూ) కుదిరింది. శనివారం సీఈఎఫ్ఎన్ఏఆర్ఎం కార్యదర్శి ఎలిసింగ్ మేరు, తెయూ వీసీ డి రవీందర్ ఆధ్వర్యంలో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎలిసింగ్ మేరు మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో జియో స్పెషల్ టెక్నాలజీస్, జియో ఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫారెస్ట్రీ, బోటనీ, జియాలజీ తదితర విభాగాలకు ఉపయోగం కలుగుతుందన్నారు. విద్యార్థులకు ప్రత్యేక సెమినార్లు, వర్క్‌షాప్స్, రీసెర్చ్ ప్రాజెక్ట్స్ సంయుక్తంగా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. వీసీ రవీందర్ మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన ఒప్పందాలతో వర్సిటీ అభివృద్ధితో పాటు పరిశోధనాత్మక నూతన అంశాలు వెలుగులోకి తీసుకురావాలన్నారు. ఈ ఒప్పందానికి తెయూ కో–ఆర్డినేటర్‌గా ఆర్ సుధాకర్‌గౌడ్, ఫారెస్ట్ అకాడమీ కో–ఆర్డినేటర్‌గా డిప్యూటీ డైరెక్టర్ వి ఆంజనేయులు వ్యవహరిస్తారు. కార్యక్రమంలో తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బి విద్యావర్ధిని, జాయింట్ సెక్రెటరీ బి ప్రవీణ, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత తోరన్, నారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ



పరిశోధకులకు అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ మిర్యాల రమేష్

తెయూ(డిచ్‌పల్లి): ఇతరుల పరిశోధన వ్యాసాల నుంచి సమాచారాన్ని కాపీ చేసి (ప్లాగరిజం) తన పేరుమీద ప్రచురించుకుంటే ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో చిటికెలో కనిపెట్టవచ్చని మహాత్మాగాంధీ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ మిర్యాల రమేష్ పేర్కొన్నారు. తెయూలో కొనసాగుతున్న ఆన్‌సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ శిక్షణ తరగతుల్లో శనివారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే దేశంలో పేరెన్నిక గలిగిన వైస్ చాన్స్‌లర్‌లు కొందరు ఇలాగే సమాచారం తస్కరించి రుజువు కావడంతో జైలుకు వెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. సమాచారం కాపీ చేసిన సందర్భంలో రిఫరెన్స్ గ్రంథంగా వారి పేరు ప్రస్తావించినట్లయితే ఎలాంటి సమస్య ఉండదన్నారు. పరిశోధకులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ప్రొఫెసర్ అల్వాల రవి మాట్లాడుతూ.. పరిశోధన రిపోర్టు ఏ విధంగా రాయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఆకుల రవి మాట్లాడుతూ.. రీసెర్చ్ పత్రాల ప్రచురణకై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ఏ పున్నయ్య, అధ్యాపకులు రాంబాబు, రవీందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, దత్తహరి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న బాణాల లక్ష్మారెడ్డి



కబడ్డీలో తలపడుతున్న జట్లు

తాడ్వాయి: క్రీడలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం కల్గటమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని ఎల్లారెడ్డి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. ఖేలో భారత్–జీతో భారత్‌లో భాగంగా తాడ్వాయిలో మూడు రోజుల పాటు బీజేవైయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఓడిన వారు నిరుత్సాహానికి గురికాకుండా తర్వాత పాల్గొనే క్రీడల్లో మరింత చురుగ్గా పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన బొల్లారం జట్టుకు రూ. 50 వేలు, రెండవ స్థానంలో నిలిచిన కన్‌కల్ జట్టుకు రూ. 25 వేలు, మూడవ స్థానంలో ఉన్న మల్లారం జట్టుకు రూ.10 వేల నగదుతో పాటు మెమొంటో అందజేశారు. బెస్ట్ రైడర్‌గా ఎంపికైన బొల్లారం జట్టు నుంచి ఆడిన లక్ష్మన్‌కు రూ.5 వేలు, డిఫెన్సర్‌గా ఎంపికైన తాడ్వాయి జట్టు నుంచి దేమె నవీన్ యాదవ్‌కు రూ. 5 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బంగ్లా చైతన్యగౌడ్, కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు లింబారెడ్డి, నాయకులు బాపురెడ్డి, వెంకట్‌రావు, రవిందర్‌రావు, సంతోష్ రెడ్డి, స్వామిరెడ్డి, యాదగిరి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ ఇన్నోవేటర్స్‌లో మెరిసిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: హైదరాబాద్ ఐఐటీ వారు నిర్వహించిన ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ కార్యక్రమంలో ఇసాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఐఐటీ హైదరాబాద్ వారు ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నుంచి వచ్చిన ప్రదర్శనలను ఆన్‌లైన్ ద్వారా పరిశీలించి 22 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వాటిలో జిల్లాలోని ఇసాయిపేట నుంచి ఉపాధ్యాయురాలు టి స్వర్ణలత ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన 2 ప్రాజెక్టులు, భిక్కనూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బాలగంగాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందిన ఒక ప్రాజెక్టు ఎంపికయ్యాయి. ఇసాయిపేట్ విద్యార్థులు సాకేత్, రక్షిత్, ప్రణయ్, హర్షవర్ధన్, నవీన్ సోలార్ డిష్ వాటర్ అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ప్రథమ బహుమతికి ఎంపికైంది. బహుమతి ప్రదానోత్సవం ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో ఆదివారం జరగనుంది. ఉపాధ్యాయురాలు స్వర్ణలత, విద్యార్థులను శనివారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలి



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతీయ గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రంథాలయంలో అభ్యర్థులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్, జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు స్పందించి గ్రంథాలయంలో వసతులు కల్పించి, ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఇబ్బందులు లేకుండ చూడాలని డిమాండ్ చేశారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా నూతన పుస్తకాలను తెప్పించాలని కోరారు. నాయకులు అష్రఫ్, సతీష్ పాల్గొన్నారు.

నేడు జనరల్ ఫిజీషియన్ల రాష్ట్రస్థాయి సదస్సు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని వంశీ ఇంటర్నేషనల్ హోటల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి ఫిజీషియన్ల సదస్సు నిర్వహిస్తున్నట్లు జీజీహెచ్ ప్రొఫెసర్, ప్రముఖ జనరల్ ఫిజీషియన్ జలగం తిరుపతిరావు వెల్లడించారు. వైద్యులు వెంకటరమణ, జలగం తిరుపతిరావు, విక్రంరెడ్డి సారథ్యంలో జరుగుతున్న సదస్సుకు రాష్ట్రస్థాయి నుంచి జనరల్ ఫిజీషియన్లు హాజరవుతున్నారని తెలిపారు. వైద్య సేవల్లో వచ్చిన మార్పులు, అత్యాధునిక సాంకేతిక వినియోగంపై చర్చించనున్నట్లు వెల్లడించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, ఫిజీషియన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర విభాగం చైర్మన్ డాక్టర్ నాగేందర్, ప్రధాన కార్యదర్శి రాజారావు, డాక్టర్ త్రిలోక్ చందర్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సైంటిఫిక్ చైర్మన్ డాక్టర్ రమేష్ హాజరుకానున్నారని తెలిపారు.

క్రైం కార్నర్

చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన వెంగల దీనకుమార్(22) శనివారం నాగిరెడ్డిపేట శివారులో చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దీనకుమార్ శనివారం తన మిత్రులు పర్శబోయిన మహేందర్, బోండ్ల జ్ఞానేశ్వర్‌తో కలిసి బొల్లారం గ్రామ శివారులోని బీడుభూమిలో గల నీలగిరి చెట్టును కొట్టుకొస్తానని వెళ్లాడు. దీనకుమార్ ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడడంతో అక్కడే ఉన్న తన మిత్రులు అతనిని చికిత్సనిమిత్తం ఎల్లారెడ్డిలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో దీనకుమార్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లుగా తెలిపారు. మృతుడి తల్లి పర్వవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నాగిరెడ్డిపేట పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి..

సిరికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. గడ్కోల్ గ్రామానికి చెందిన పెద్దపుల్ల నందమయ్య (46) ఈ నెల 2న రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొన్నాడు. ప్రమాదంలో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుడి కుమారుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మలావత్ గోపి (ఫైల్)

నాగిరెడ్డిపేట: కూతుళ్ల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులు తీర్చలేక నాగిరెడ్డిపేట మండలంలోని బంజరతండాకు చెందిన మలావత్ గోపి(46) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తండాకు చెందిన గోపి తనకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. తన ఇద్దరు కూతుర్ల పెళ్లి కోసం రూ.ఆరు లక్షల వరకు అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలని మదనపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 2న రాత్రి ఇంట్లో పురుగులమందు తాగాడు. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న గోపి శుక్రవారం రాత్రి చనిపోయాడు. మృతుడికి భార్య శాంతి, కుమారుడు చిరంజీవి ఉన్నారు. చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్రీసిద్ధరామేశ్వరనగర్‌లో యువకుడు..

భిక్కనూరు: మండలంలోని శ్రీసిద్ధరామేశ్వరనగర్‌లో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన పుట్ట వెంకటేష్ (25) దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని తీవ్రంగా మదనపడేవాడు. ఈ క్రమంలో ఈనెల 10న పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



లారీని ఢీకొన్న బైక్

పిట్లం: మండలంలోని గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి బైక్ లారీ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామానికి చెందిన జలందర్ గౌడ్, రాజు బైక్‌పై పిట్లం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గద్దగుండు తండా సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని హైవే అంబెలెన్స్‌లో పిట్లం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

చేపల వేటకు వెళ్లి మృత్యువాత

మాచారెడ్డి: చేపల వేటకు వెళ్లి ఓ జాలరి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని లక్ష్మీరావులపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తోకల రాజు (34) శుక్రవారం సాయంత్రం చేపల వేట కోసం లచ్చాపేట శివారులోని పాల్వంచ వాగులోకి వెళ్లాడు. చేపల వేటకు వెళ్లిన రాజు రాత్రి పొద్దు పోయే వరకు ఇల్లు చేరక పోయే సరికి శనివారం వాగులో గాలించగా బండ కింద శవమై కనిపించాడు. మృతునికి భార్య రాజమణి, కుమారుడు యశ్వంత్ ఉన్నారు.